TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-212 | పేజీలు:-4 | బుధవారం 15- 07 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## హర్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్



20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి!

- హర్మూజ్ జలసంధిలో కార్గోపై 20 శాతం సుంకం ప్రతిపాదనను ఉపసంహరించుకున్న ట్రంప్
- ఈ ఒప్పందాల వల్ల అమెరికాలో లక్షల ఉద్యోగాలు వస్తాయని ట్రంప్ ప్రకటన
- ఒక్కరోజు ముందే హర్మూజ్ భద్రతకు తాము డబ్బు వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటన
- ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న పరిణామం - మిగతా 2 లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం

## ఏఐ కోసం రెండుసార్లు మూల్యం చెల్లిస్తున్నారు




కంపెనీలకు సత్య నాదెళ్ల వార్నింగ్!

- ★ ఏఐ కోసం కంపెనీలు రెండుసార్లు మూల్యం చెల్లిస్తున్నాయని సత్య నాదెళ్ల హెచ్చరిక
- ★ డబ్బుతో పాటు విలువైన సంస్థాగత పరిజ్ఞానాన్నీ కోల్పోతున్నాయని విశ్లేషణ
- ★ ఏఐ వాడకంలో 'రివర్స్ ఇన్ఫర్మేషన్ పారడాక్స్' ఏర్పడుతోందని వ్యాఖ్య
- ★ ఒకే ఏఐ ప్రొవైడర్‌కు పరిమితం కాకుండా ఉండాలని కంపెనీలకు సూచన
- ★ సంస్థాగత పరిజ్ఞానాన్ని కాపాడుకోవడమే నిజమైన పోటీతత్వమని స్పష్టీకరణ

2లో

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడకంలో కంపెనీలు తమకు తెలియకుండానే రెండుసార్లు మూల్యం చెల్లిస్తున్నాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ,

## ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి

ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి



- హైదరాబాద్‌లో 21 శాతం ఓటరు సవరణ మాత్రమే పూర్తయిందన్న పొన్నం
- ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉందన్న మంత్రి
- ప్రక్రియ పూర్తి కావడానికి ఈ గడువు సరిపోదని వెల్లడి

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల - మిగతా 2 లో

## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు



- కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య వివాదం
- శ్రీహరి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్న సురేఖ
- సంయమనం పాటించాలన్న మీనాక్షి నటరాజన్

తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం - మిగతా 2 లో

# సీఎం రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు

క్లారిటీ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో నమోదు
- ఇది సాధారణ తప్పిదమేనని స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం
- కొడంగల్‌లో ఓటును ఉంచి, అచ్చంపేటలో తొలగించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా దీన్ని సరిదిద్దుతున్నామన్న అధికారులు



2లో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు వేర్వేరు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఉండటంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇది ఓటర్ల జాబితాలో దొర్లిన సాధారణ సాంకేతిక లోపమేనని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా

## 'సార్, మిమ్మల్ని హగ్ చేసుకోవచ్చా?'

# సీఎం విజయ్ రియాక్షన్ ఇదే!


- హగ్ చేసుకోవచ్చా? అని సీఎం విజయ్‌ని అడిగిన జూనియర్ డాక్టర్
- చిరునవ్వుతో అంగీకరించిన ముఖ్యమంత్రి
- చెన్నైలో ఆరోగ్య శాఖ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఘటన
- మొత్తం 2,144 మందికి నియామక ఉత్తర్వులు అందజేత
- సీఎం విజయ్ నిరాడంబరతపై నెటిజన్ల ప్రశంసల వర్షం



2లో

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరోసారి తన నిరాడంబరతతో, మానవీయ కోణంతో ప్రజల మనసులను గెలుచుకున్నారు. చెన్నైలో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఓ యువ డాక్టర్ ఆయనను ఆప్యాయంగా కౌగిలించుకున్న

## ఇరాన్‌లోని మరో అణు కేంద్రంపై దాడికి ట్రంప్ సంకేతాలు!



- పికయాక్స్ కేంద్రం లక్ష్యాల జాబితాలో ఉందన్న ట్రంప్
- ఆ కేంద్రంపై నిరంతరం నిఘా కొనసాగుతోందని వెల్లడి
- ఇరాన్ ఒప్పందాలను ఉల్లంఘిస్తోందని ఆరోపణ
- ఇరాన్‌కు అణ్వాయుధం దక్కనివ్వబోమని స్పష్టం
- ఒప్పందం కుదిరే అవకాశం ఉందని వ్యాఖ్య
- ఇరాన్‌పై ఒత్తిడి కొనసాగుతుందని సంకేతం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై కఠిన వ్యాఖ్యలు చేశారు. - మిగతా 2 లో

## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ

పోలండ్ మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు



- ఉక్రెయిన్‌పై అణుదాడిని ప్రధాని మోదీ నివారించారన్న పోలండ్ మంత్రి
- రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాలే ఇందుకు కారణమని వ్యాఖ్య
- మోదీ చెప్పే మాటలను పుతిన్ శ్రద్ధగా వింటారని వ్యాఖ్య
- 2022 చివర్లో అణుయుద్ధ భయాలు పెరిగిన వేళ ఈ పరిణామం

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో అణ్వస్త్రాల ప్రయోగం జరగకుండా నివారించడంలో - మిగతా 2 లో

## ముద్రగడ పద్మనాభం ఇక లేరని తెలిసి చింతిస్తున్నాను



- మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూత
- ఆయన మృతిపై స్పందించిన పవన్ కల్యాణ్
- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా పనిచేసిన ముద్రగడ
- కుటుంబ సభ్యులకు, మద్దతుదారులకు పవన్ ప్రగాఢ సానుభూతి

మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి - మిగతా 2 లో

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు



- ★ మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్
- ★ మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- ★ ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం

మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం - మిగతా 2 లో

# అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి

- మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశం
- సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత అన్న చంద్రబాబు
- అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి.. నాలుగు గోడలకే పరిమితం కావొద్దని సూచన
- ఇకపై నెలవారీ ఆర్థిక నివేదికల (వీజు=) ఆధారంగా సమీక్ష ఉంటుందని స్పష్టీకరణ



2లో

"సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పనిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
బుధవారం 15- 07 - 2026

# అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి

మొదటిపేజీ తరువాయి – ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు.

### డేటా ఆధారిత పాలన.. నెలవారీ నివేదికలతో సమీక్ష

డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్ – వీజు=) ద్వారా రాష్ట్ర ప్రగతిని సమీక్షించుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. "ఇకపై ప్రతీ నెలా ఆర్థిక నివేదికలు విడుదల చేస్తాం. వాటి ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరు, రెవెన్యూ రాబడులు, అధికారుల నైపుణ్యాలను అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. ప్రతీ నెలా కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమావేశమై పురోగతిని సమీక్షించుకుందాం," అని తెలిపారు. గత ఐదేళ్ల (2019–24) పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని, విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం సమిష్టిగా పనిచేసి, క్షేత్రస్థాయిలో కొంతవరకు మార్పు తేగలిగాం. గత పాలనలో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం పోయింది. మేం వచ్చాక పరిస్థితి మార్చి, దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం" అని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా 'స్వర్ణాంధ్ర–2047' విజన్‌ను రూపొందించామని, తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు.

### అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని శాఖల పనితీరు సరిగా లేకపోవడంతో, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ వివాదాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (గ్రా+=గా)లో 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పెట్టుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి ప్రాంతాల్లో భూ సమస్యలను పరిష్కరించామని, రీసర్వే ద్వారా ప్రతి నెలా 9వ తేదీన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.

### ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై స్పష్టత

రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో దృష్టి సారించిందని సీఎం తెలిపారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేస్తామని, సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

# ముద్రగడ పద్మనాభం ఇక లేరని తెలిసి చింతిస్తున్నాను

మొదటిపేజీ తరువాయి – పవన్ కల్యాణ్ స్పందించారు. ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పవన్ కల్యాణ్ తన సంతాప సందేశంలో, "మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం గారు తుదిశ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ రాజకీయ సేవలను పవన్ గుర్తుచేసుకున్నారు. 1978లో తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన ఆయన, మొత్తం నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారని వివరించారు. ముద్రగడ పద్మనాభం అర్థాంగి, కుమారుడు, కుమార్తెతో పాటు ఇతర కుటుంబ సభ్యులకు, ఆయన మద్దతుదారులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారు

మొదటిపేజీ తరువాయి – కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎస్ఐఆర్ గడువు పొడిగించాలి

ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. ఓటరు నమోదు ప్రక్రియకు మరింత సమయం కావాలని కోరారు. హైదరాబాద్‌లో ఓటరు సవరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కేవలం 21 శాతం ఓటరు సవరణ మాత్రమే పూర్తయిందని, ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉందని చెప్పారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి ఈ సమయం సరిపోదని... ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. 4,500 పోలింగ్ స్టేషన్లలో ప్రక్రియ నత్తనడకన సాగుతోందని మంత్రి వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులు (దీూా) ఇళ్లకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు సరిగా ఇవ్వడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీ క్యాడర్ చురుకుగా పని చేయాలని సూచించారు. ఓటు లేకపోతే ప్రభుత్వ పథకాలు రావనే ప్రచారం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భేటీలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ గడువు పొడిగింపుపై ఈసీ నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఉత్కంఠగా మారింది.

# మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి – శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు

మొదటిపేజీ తరువాయి – కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) ప్రక్రియలో భాగంగా దీనిని సరిదిద్దుతున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక 'ఫ్యాక్ట్‌చెక్ తెలంగాణ' తన 'ఎక్స్' ఖాతాలో ప్రకటన విడుదల చేసింది. కొడంగల్, అచ్చంపేట (కొండారెడ్డిపల్లి) నియోజకవర్గాల ఓటర్ల జాబితాల్లో ముఖ్యమంత్రి పేరు (ఎపిక్ నెం: ుజూ0274035) ఉన్నప్పటికీ, ఆయన రెండు చోట్ల ఓటు వేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే ఓటును కొనసాగించాలని, కొండారెడ్డిపల్లి జాబితా నుంచి పేరును తొలగించాలని రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇప్పటికే ఎన్నికల అధికారులకు విన్నవించారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని నివాసాన్నే ఆయన ధ్రువీకరించగా, అచ్చంపేట నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లి ఆయన స్వగ్రామం. నివాసం లేదా వృత్తిరీత్యా ప్రాంతాలు మారినప్పుడు రికార్డులు సకాలంలో అప్‌డేట్ కాకపోవడం, పరిపాలనాపరమైన పరిమితుల వల్ల ఇటువంటి ద్వంద్వ నమోదులు జరుగుతుంటాయని అధికారులు వివరించారు. 'ఒక వ్యక్తి – ఒక ఓటు' అనే సూత్రాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో ఎలాంటి ఉద్దేశపూర్వక తప్పిదం లేదని, ఇది సాధారణంగా జరిగేదేనని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.c

# హర్మ్యూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్



మొదటిపేజీ తరువాయి – సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మ్యూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి. మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

# ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ

మొదటిపేజీ తరువాయి – భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెస్కీ ప్రశంసించారు. 2022 చివరి నాటికి ఉక్రెయిన్‌పై అణుదాడికి రష్యా సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమైన తరుణంలో, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించగలిగారని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో విశేష గౌరవం పొందిన గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌కు రష్యాతో చారిత్రక, సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. అందుకే మోదీ మాటలను పుతిన్ అత్యంత శ్రద్ధతో వింటారు" అని పేర్కొన్నారు. రష్యాపై ప్రభావం చూపగలిగే అతికొద్ది మంది ప్రపంచ నేతల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు మోదీ కూడా ఒకరని బార్టోస్జెస్కీ వివరించారు. 2022 ద్వితీయార్థంలో ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చినప్పుడు, రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించవచ్చన్న భయాందోళనలు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నాయి. అయితే అప్పట్లో పెను ప్రమాదం తప్పడం వెనుక మోదీ దౌత్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మొదట్లో రష్యా నుంచి భారత్ రాయితీపై చమురు కొనుగోలు చేయడాన్ని పోలండ్ విమర్శించినప్పటికీ, ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని, ఒకరి ఆర్థిక, వ్యూహాత్మక అవసరాలను మరొకరు గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో భారత్ మొదటి నుంచి తటస్థ వైఖరిని అనుసరిస్తోంది. కేవలం దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. అటు రష్యాతో ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూనే, ఇటు శాంతి స్థాపన కోసం పిలుపునిస్తోంది. ఈ క్రమంలో, ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్న నాటో సభ్యదేశం పోలండ్ నుంచి మోదీ పాత్రపై ఈ స్థాయిలో ప్రశంసలు రావడం అంతర్జాతీయంగా భారత్ దౌత్య

# ఏఐ కోసం రెండుసార్లు మూల్యం చెల్లిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి – భారత సంతతికి చెందిన సత్య నాదెళ్ల హెచ్చరించారు. ఒకటి డబ్బు రూపంలో అయితే, రెండోది అంతకంటే విలువైన తమ సొంత యాజమాన్య పరిజ్ఞానాన్ని కోల్పోవడం ద్వారా అని ఆయన తన వ్యక్తిగత బ్లాగ్‌లో విశ్లేషించారు. ఏఐ మోడల్ మెరుగ్గా పనిచేయాలంటే, దానికి మన సంస్థకు సంబంధించిన ఎక్కువ సమాచారాన్ని అందించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో కంపెనీలు తమ విలువైన జ్ఞానాన్ని కోల్పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని వివరించేందుకు నాదెళ్ల, నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త కెన్నెత్ ఆరో ప్రతిపాదించిన 'ఇన్ఫర్మేషన్ పారడాక్స్' (సమాచార వైరుధ్యం) సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. ఆరో సిద్ధాంతం ప్రకారం, ఒక సమాచారం విలువ ఏంటో తెలియకుండా కొనుగోలుదారు దాన్ని కొనలేడు, కానీ ఒకసారి ఆ సమాచారం తెలిశాక, దానికోసం చెల్లించాల్సిన అవసరం ఉండదు. అయితే, ఏఐ యుగంలో ఈ సమస్య తలకిందులై 'రివర్స్ ఇన్ఫర్మేషన్ పారడాక్స్'గా మారిందని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఇక్కడ కొనుగోలు చేసిన ఏఐ సాధనాన్ని వినియోగించుకోవడం కోసం, కొనుగోలుదారుడే తన విలువైన పరిజ్ఞానాన్ని విక్రేతకు (ఏఐ ప్రొవైడర్) అప్పగించాల్సి వస్తోందని వివరించారు. మణిపాల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన నాదెళ్ల, ఈ ప్రక్రియ వల్ల ఏఐ ప్రొవైడర్లకు, వాడుకదారులైన కంపెనీలకు మధ్య సమాచార అసమానత పెరుగుతుందని హెచ్చరించారు.

### పరిష్కారం ఏమిటి?

ఈ సమస్యకు పరిష్కారంగా కంపెనీలు తమ 'లెర్నింగ్ లూప్' (శ్రీముతీఅఅఅస్త్ర శ్రీశీశీజూ)పై పూర్తి నియంత్రణ సాధించాలని నాదెళ్ల సూచించారు. ఉద్యోగులు ఏఐకి ఇచ్చే ప్రతి ప్రాంప్ట్, ఏఐ తప్పు చేసినప్పుడు అందించే సవరణలు, రూపొందించే వర్క్‌ఫ్లోలు వంటివన్నీ విలువైన సంస్థాగత పరిజ్ఞానంగా మారతాయని ఆయన అన్నారు. కాలక్రమేణా ఇదే ఒక కంపెనీకి పోటీలో ఆధిక్యాన్ని అందిస్తుందని, అలాంటి పరిజ్ఞానాన్ని తెలియకుండా ఏఐ ప్రొవైడర్లకు అప్పగించకూడదని స్పష్టం చేశారు. కంపెనీలు తమ అంతర్గత సమాచారం, కస్టమర్లతో జరిపే సంభాషణలు, ఏఐ ద్వారా పొందిన విశ్లేషణలు వంటివి తమ అనుమతి లేకుండా బయటి ఏఐ మోడళ్ల అభివృద్ధికి ఉపయోగపడకుండా ఒక కొత్త 'ట్రస్ట్ బౌండరీ' (విశ్వసనీయత సరిహద్దు) ఏర్పాటు చేసుకోవాలని నాదెళ్ల పిలుపునిచ్చారు. అంతేకాకుండా, వ్యాపార సంస్థలు ఒకే ఏఐ ప్రొవైడర్‌పై ఆధారపడకుండా ఉండాలని గట్టిగా సూచించారు. వేర్వేరు ఏఐ మోడళ్ల మధ్య సులభంగా మారగలిగే వ్యవస్థలను నిర్మించుకోవడం ద్వారా ఖర్చులను నియంత్రించుకోవచ్చని, వెండర్ లాక్–ఇన్ సమస్యను అధిగమించవచ్చని ఆయన వివరించారు. ఏఐ యుగంలో నిజమైన పోటీతత్వం కేవలం టెక్నాలజీని వాడటంలో కాదని, దాని వాడకం ద్వారా సృష్టించబడిన పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవడంలోనే ఉందని ఆయన తన వాదనను ముగించారు.

# ఇరాన్‌లోని మరో అణు కేంద్రంపై దాడికి ట్రంప్ సంకేతాలు!

మొదటిపేజీ తరువాయి – ఇరాన్‌లోని 'పికయాక్స్ మౌంటెన్' అణు కేంద్రం అమెరికా లక్ష్యాల జాబితాలోనే ఉందని చెప్పారు. ఆ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని వెల్లడించారు. అవసరమైతే త్వరలోనే అక్కడ కూడా దాడి జరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. స్పేస్ ఫోర్స్‌తో పాటు ఇతర వ్యవస్థల ద్వారా ఆ కేంద్రంపై నిరంతరం నిఘా కొనసాగుతోందని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అక్కడ ఎలాంటి కదలికలు కనిపించడం లేదని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన సమాచారం వచ్చినప్పుడల్లా దాన్ని అడ్డుకుంటున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌తో ఒప్పందం దాదాపు ఖరారయ్యే దశలో.. ఆ దేశమే వెనక్కి తగ్గిందని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందాలను ఉల్లంఘించడం ఇరాన్‌కు అలవాటేనని విమర్శించారు. ఇరాన్ నాయకత్వంపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారి చేతికి అణ్వాయుధం దక్కితే దాన్ని వినియోగించడానికి ఏమాత్రం వెనుకాడరని ఆరోపించారు. అయితే ఆ దేశ నాయకులపై తీసుకునే చర్యల గురించి మాత్రం మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన మరో కార్యక్రమంలో కూడా ట్రంప్ ఇదే అంశంపై స్పందించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇరాన్‌కు అణ్వాయుధం దక్కనివ్వబోమని స్పష్టం చేశారు. మరోవైపు చర్చలకు తలుపులు పూర్తిగా మూసుకుపోలేదని, ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఇంకా ఉందని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునే విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

# 'సార్, మిమ్మల్ని హగ్ చేసుకోవచ్చా?' సీఎం విజయ్ రియాక్షన్ ఇదే!

మొదటిపేజీ తరువాయి – ఘటన అందరినీ ఆకట్టుకుంటోంది. "సార్, మిమ్మల్ని ఒకసారి హగ్ చేసుకోవచ్చా?" అని ఆ డాక్టర్ అడగ్గా, సీఎం విజయ్ చిరునవ్వుతో అంగీకరించి అతడిని ఆప్యాయంగా హత్తుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తమిళనాడు వైద్యారోగ్య శాఖలో కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించేందుకు చెన్నైలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 751 మంది అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు, 1,393 మంది హెల్త్ ఇన్‌స్పెక్టర్లతో కలిపి మొత్తం 2,144 మందికి సీఎం విజయ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే స్టేజ్‌పైకి వచ్చిన ఓ జూనియర్ డాక్టర్, తన అభిమాన నేతను చూసి ఈ విధంగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విజయ్.. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి సామాన్యులతో మమేకమవుతున్నారు. గతంలో కూడా ఓ గర్భిణీ అభ్యర్థిని కోసం స్వయంగా స్టేజ్ దిగి వచ్చి ఆమెకు నియామక పత్రం అందించిన సంగతి తెలిసిందే. తాజా ఘటనతో సీఎం హోదాలో ఉన్నప్పటికీ ఎంతో ఆప్యాయంగా మెలుగుతున్న విజయ్ తీరుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది.

# 60 రోజులపాటు యుద్ధం?.. కాంగ్రెస్‌కు ట్రంప్ అధికారిక నోటీసు

వాషింగ్టన్, జూలై 14: ఇరాన్‌పై జూలై 7న మళ్లీ యుద్ధం ప్రారంభమైనట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికన్ కాంగ్రెస్‌కు ఒక అధికారిక నోటిఫికేషన్ పంపించారు. కాంగ్రెస్ ఆమోదం లేకుండానే ఆ ప్రాంతంలో సైన్యాన్ని వినియోగించడానికి 60 రోజుల పాటు కొత్త అవకాశాన్ని పొందడమే ఈ లేఖ ఉద్దేశంగా కనిపిస్తోంది. అమెరికన్లను, అలాగే అమెరికా జాతీయ భద్రత, విదేశాంగ విధాన ప్రయోజనాలను రక్షించాల్సిన నా బాధ్యతకు అనుగుణంగానే నేను ఈ సైనిక చర్యను చేపట్టాను అని ఆ లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. ఏప్రిల్ 7న తాను జారీచేసిన రెండు వారాల కాల్పుల విరమణ, దాన్ని పొడిగించడం, యుద్ధానికి ఒక దౌత్యపరమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు తన ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆ లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. జూన్ 17న ఇరాన్‌తో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ హెర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడి చేయడం ద్వారా ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించక తప్పలేదని ఆయన తెలిపారు. ఘర్షణ తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో గల్ఫ్‌లో ఇరాన్ నౌకా రవాణాపై అమెరికా తన దిగ్బంధనాన్ని పునరుద్ధరిస్తోందని, అలాగే హెర్మూజ్ జలసంధి తెరిచి ఉండేలా చూస్తుందని ట్రంప్ తన లేఖలో పేర్కొన్నారు. యుద్ధాన్ని ప్రకటించే అధికారం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని, అధ్యక్షుడికి కాదని అమెరికా రాజ్యాంగం పేర్కొంటోంది. అయితే అమెరికా భద్రతను కాపాడేందుకు చట్టసభల ఆమోదం లేకుండానే స్వల్పకాలిక సైనిక చర్యలను చేపట్టే అధికారం తమకు ఉందని అమెరికా అధ్యక్షులు చాలా కాలంగా వాదిస్తూ వస్తున్నారు.

### యుద్ధ అధికారాల చట్టం

యుద్ధ అధికారాల చట్టం ప్రకారం అధ్యక్షుడు ఘర్షణలు ప్రారంభించిన 48 గంటల్లోపు కాంగ్రెస్‌కు తెలియచేయాలి. కాంగ్రెస్ ఆమోదం లేకుండా ప్రారంభించిన సైనిక చర్యను 60 రోజుల్లోపు ముగించాలి. ఇరాన్ విషయంలో మొదటి 60 రోజుల గడువు మే 1వ తేదీనే ముగిసింది. అయితే దాడులు కొనసాగుతున్నప్పటికీ,



అమెరికా దళాలు ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించినప్పటికీ కాల్పుల విరమణతో ఘర్షణలు ముగిశాయని ప్రకటించిన ట్రంప్ ఆ గడువు నిబంధన వర్తించదని ప్రకటించారు. అయితే, యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న డెమోక్రాట్లు, కొందరు రిపబ్లికన్లు ప్రభుత్వం చట్టాన్ని వక్రీకరిస్తోందని వాదిస్తున్నారు. రెండు సభలలోనూ తన తోటి రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీలు ఉన్నప్పటికీ ఇరాన్‌తో శత్రుత్వం నుండి అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని ట్రంప్‌ను ఆదేశిస్తూ సెనేట్, హౌస్ రెండూ గత నెలలో ఒక తీర్మానాన్ని ఆమోదించాయి.

### పికాక్స్ పర్వతంపై ట్రంప్ దృష్టి

ఇరాన్‌లోని జాగ్లోస్ పర్వత శ్రేణిలో లోతుగా ఉన్న ఒక రహస్య భూగర్భ స్థావరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా లక్ష్యంగా మారింది. ఇది రహస్య యురేనియం శుద్ధి కేంద్రం లేదా ఆయుధాల తయారీకి దాదాపు సరిపోయే యురేనియం నిల్వ కేంద్రమని కొందరు నిపుణులు భావిస్తున్నారు. పికాక్స్ పర్వతం(కుహ్–ఏ కోలాంగ్ గాజ్ లా అని కూడా పిలుస్తారు)ను దృష్టిలో ఉంచుకుని ట్రంప్ నుంచి తాజా వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ ప్రాంతం జాగ్లోస్ పర్వత శ్రేణిలో ఉంది. గత ఏడాది జూన్‌లో అమెరికాకు చెందిన బంకర్ బస్టర్ బాంబుల దాడికి గురై తీవ్రంగా దెబ్బతిన్న నతాంజ్ అణు కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే పికాక్స్ పర్వతం కింద ఉన్న విస్తారమైన సొరంగాల సముదాయం బంకర్–బస్టర్ బాంబుల పరిధికి మించినదని భావిస్తున్నట్లు అమెరికా అధికారులు, నిపుణులను ఉటంకిస్తూ రాయిటర్స్, ది వాషింగ్టన్ పోస్ట్ పేర్కొన్నాయి. ఆ భూగర్భ హాళ్లు సుమారు 200 అడుగుల మట్టి, రాళ్లు లేదా 20 అడుగుల కాంక్రీట్‌ను ఛేదించగల ఆయుధాల సామర్థ్యం కంటే లోతుగా ఉన్నట్లు నిపుణుల అంచనా. తన తదుపరి లక్ష్యం పికాక్స్ పర్వతమని సోమవారం ట్రంప్ సూచించారు. గత ఏడాది అమెరికా దాడులు ఇరాన్ అణు కార్యక్రమాన్ని తుడిచి పెట్టివేశాయని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ ఆయన తాజా హెచ్చరికతో పికాక్స్ పర్వతంపై అమెరికా దృష్టి పెట్టినట్లు బయటపడింది.

### 20% హెర్మూజ్ ఫీజు ప్రతిపాదన ఉపసంహరణ: ట్రంప్

హెర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే రవాణా నౌకలపై 20 శాతం రుసుము విధించే తన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ఉపసంహరించుకున్నారు. దీనికి బదులుగా అమెరికాతో గల్ఫ్ దేశాలు భారీ వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకుంటాయని ఆయన ప్రకటించారు. ఇరాన్‌కు సంబంధించిన నౌకలు మినహా హెర్మూజ్ జలసంధి ఇప్పుడు ప్రపంచవ్యాప్త నౌకాయానానికి తెరచి ఉందని, ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సముద్ర మార్గాలలో ఒకదానిని అమెరికా సైన్యం సురక్షితం చేసిందని ట్రూత్ సోషల్ పోస్ట్‌లో ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియా నాయకత్వంతో జరిపిన అత్యంత ఫలవంతమైన చర్చల ఆధారంగా 20% రీఎంబర్స్‌మెంట్ ఫీజు స్థానంలో వివిధ గల్ఫ్ దేశాలు అమెరికాతో కుదుర్చుకునే వాణిజ్య పెట్టుబడి ఒప్పందాలను ప్రవేశపెట్టాలని తాను నిర్ణయించుకున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. భారీ స్థాయిలో ఫ్యాక్టరీలు, కర్మాగారాలు, పరికరాలు అమెరికాలోకి వెల్లువెత్తడాన్ని మనం చూస్తాము. అదనంగా లక్షలాది అధిక వేతన అమెరికన్ ఉద్యోగాలను సృష్టిస్తుంది అని ట్రంప్ తన పోస్ట్‌లో తెలిపారు.

# మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



జన్నారం జూలై 14 నిజం న్యూస్: పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్ ముట్టడికి వెళ్తున్న జన్నారం మండల మాజీ సర్పంచ్ లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి 3 సంవత్సరాలు గడుస్తున్న పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అన్నారు. బిల్లులు విడుదల చేయాలన్నారు.

## వేములవాడ టౌన్ మా రక్తం తీసుకో.. రైతన్నకు నీళ్లివ్వు! సీఎం రేవంత్‌రెడ్డిపై చల్మెడ లక్ష్మీనరసింహారావు ధ్వజం

వేములవాడలో బీఆర్ఎస్ వినూత్న నిరసన 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' పేరిట క్యాంప్ ఏర్పాటు చేసిన చల్మెడ

మంత్రి పదవి కోసమే ఆది శ్రీనివాస్ ఆరాటం.. ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డ చల్మెడ లక్ష్మీనరసింహారావు



వేములవాడ టౌన్ జూలై 14 నిజం న్యూస్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మా రక్తం తీసుకొని నీ రక్తదాహం తీర్చుకో.. కానీ కండ్ల ముందర పంటలు ఎండిపోయి కన్నీళ్లు పెడుతున్న రైతాంగాన్ని సాగునీరిచ్చి తక్షణమే ఆదుకో అని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో వినూత్నంగా 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' పేరిట బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు స్వయంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పదవి దక్కించుకోవాలనే ఏకైక తాపత్రయంతోనే ఆది శ్రీనివాస్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అధికార పక్షం కక్షసాధింపు రాజకీయాలు పక్కనబెట్టి, ఎండిపోతున్న పంటలను కాపాడటంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు.

# సాయి రూప ట్రస్ట్ ఆదర్శ సేవ

లింగంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

పుస్తకాలు, బ్యాగులు, పెన్నుల అందజేత -- ట్రస్ట్ సభ్యులకు గ్రామస్థుల ఘన సన్మానం



వేములవాడ టౌన్ జూలై 14 నిజం న్యూస్: సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు, పెన్నులను పంపిణీ చేసి వారి విద్యాభ్యాసానికి చేయూతనిచ్చింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఏద్దండి రాజు, దూలం భూమేష్ గౌడ్, గొంటి నవీన్ విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సాయి రూప ట్రస్ట్ సేవలను కొనియాడిన గ్రామస్థులు ట్రస్ట్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యా సహాయం గొప్ప పెట్టుబడిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సేవా సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని, సాయి రూప ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గొంటి నవీన్ సేవలను గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం నిర్వహణలో ఆయన అందించిన సహకారం ప్రశంసనీయమని పేర్కొంటూ, ట్రస్ట్ తరపున కూడా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొక్కుల నరేష్, ఉప సర్పంచ్ ఆకుల ఎల్లయ్య, కేడీసీసీ డైరెక్టర్ కిషన్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, పబ్బా సురేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు జయశీల, వార్డు సభ్యులు పురుగుల కవిత, లావణ్య, ఉపాధ్యాయురాలు రజిత, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ లైన్‌మెన్‌ల సమస్యపై చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం



కురవి జూలై 14 నిజం న్యూస్: డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా ఏజెన్సీలు మరియు కాంట్రాక్టు ఉద్యోగుల డేటా సేకరణ,వెరిఫికేషన్ ఆడిట్ కార్యక్రమం సందర్భంగా మిషన్ భగీరథ పాలేరు గ్రిడ్ సెగ్మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు,జిల్లా ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు కలిసి ఆడిట్‌కు వచ్చిన చీఫ్ సెక్రటరీ (సీఎస్) కి వినతి పత్రాన్ని అందజేశారు.గత అనేక సంవత్సరాలుగా లైన్‌మెన్ హోదాలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ప్రభుత్వ రికార్డుల్లో హెల్పర్గా నమోదు చేయడం అన్యాయమని,వెంటనే ఈ నిర్ణయాన్ని సవరించి వారి అసలు హోదా అయిన లైన్‌మెన్గానే నమోదు చేయాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన చీఫ్ సెక్రటరి సమస్యను పరిశీలించి, సంబంధిత అంశాన్ని నోటీసు తీసుకుని పూర్తి నివేదికను పై అధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించడంతో కార్మికులు తమ సమస్యకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# నక్షత్రాల వనమహోత్సవం



చేగుంట, జూలై 14 నిజం న్యూస్: చేగుంట మండల కేంద్రంలో మంగళవారం నక్షత్రాల వనమహోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ స్రవంతి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం 27 నక్షత్రాల పేరుతో 27 రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బాల్ లక్ష్మి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీవో శ్వేత, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రజనక రామచంద్రం ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. నక్షత్ర వనాల పెంపకం వల్ల ఆధ్యాత్మిక చింతనతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోడీసెరియాల్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తాం ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు పటేల్



ప్రతినిధి, ఉట్నూర్ జూలై 14 నిజం న్యూస్: ఉట్నూర్ మండలంలోని గోడీసెరియాల్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు పటేల్ మాట్లాడుతూ, గోడీసెరియాల్ గ్రామ బస్సు సమస్య ఇప్పటికే తన దృష్టికి వచ్చిందని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుని, త్వరలోనే గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో గోడీసెరియాల్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన గోగుల సరిత, తుంగతుర్తి రవి




మేడిపల్లి, జూలై 14 నిజం న్యూస్: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ( టీఎస్ సీపీసీఆర్ ) సభ్యురాలు గోగుల సరిత, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పార్టీ నాయకులు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన గోగుల సరిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యత, పరిశుభ్రత, పాఠశాల వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన వారు పాఠశాలలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం,మహ్మద్ మజర్,ప్రణయ్,బర్రె నాగరాజు,సోమయ్య,కాటపాక కుమార్,సునిల్,జయందర్,పంగ రాజు,శరత్ గౌడ్, సాయిరాం గౌడ్,భరత్,మేడిపల్లి మండల ఎం ఈ ఓ శ్రీనివాస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులుసత్య ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ పక్రియ లో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలి

## మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

మేడిపల్లి, జూలై 14 నిజం న్యూస్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9.10 వార్డులలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ (సంక్షిప్త ఓటర్ సవరణ) కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి లి పాల్గొని ఎస్ ఐ ఆర్ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలపై బి ఎల్ ఓ, లిబీఆర్ఎస్ పార్టీ బీఎల్ ఎ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఐదవ డివిజన్ మాజీ అధ్యక్షుడు మునికుంట్ల కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో పర్వతాపూర్ శభరి గార్డెన్ ముందు నిర్వహించిన ఎస్ ఐ ఆర్ ఎన్ రోల్ మెంట్ అవగాహన కార్యక్రమం లో వాలంటీర్స్ తో దరకాస్తు ఫారాలు పూరించే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పౌరుడు ఎస్ ఐ ఆర్ లో భాగస్వామ్యం కావాలని మాజీ మేయర్ ఈ సందర్భంగా సూచించారు. లేని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్, కొల్తూరి మహేష్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, వివిధ డివిజన్ ల మాజీ



అధ్యక్షులు, కోనేటి వెంకట్,యాసారం శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు శశిధర్ రెడ్డి, సతీష్, అమర్ పటేల్, సుబాన్,లారెన్స్,సురేష్,అబ్దుల్, మునికుంట్ల ప్రదీప్ ,సందీప్ రాజీవ్ గౌడ్,బీపీఎం కాలనీ అధ్యక్షుడు మునికుంట్ల నరేష్ గౌడ్,బాలక్ష్మి కాలనీ మాజీ అధ్యక్షుడు సబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తీరని సమస్యల మేఘాలు.. ఉపాధ్యాయుడి మనసులో ఆవేదనల గాయాలు!

మూడేళ్లుగా ఎదురుచూపులే.. పెండింగ్‌లోనే పీఆర్సీ!

దాచుకున్న జీపీఎఫ్ సొమ్ముకూ తప్పని తిప్పలు.

ఆరు డీఏలు, మెడికల్ బిల్లుల కోసం ఆరాటం.

కేసముద్రం మండల టి పి టి ఎఫ్ సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షులు బాలాస్టి రమేష్ నిప్పులు.

కేసముద్రం జూలై 14 నిజం న్యూస్: నేల నమ్ముకున్న రైతు దేశానికి వెన్నెముక అయితే.. ఆ నేలపై నడిచే మనుషుల బ్రతుకులను తీర్చిదిద్దే గురువు సమాజానికి దిక్సూచి. కానీ, నేడు తెలంగాణ గడ్డపై ఆ అక్షర శిల్పి మనసు నిండా అశాంతి, బ్రతుకుపై ఆర్థిక భారాల నీడలు కమ్ముకున్నాయి. సమాజ శ్రేయస్సు కోసం, రేపటి పౌరుల భవిత కోసం నిరంతరం శ్రమించే ఉపాధ్యాయుడు.. నేడు తన హక్కుల కోసం, కష్టార్జితం కోసం ప్రభుత్వాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి దాపురించింది. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ని వెంటనే ప్రకటించాలంటూ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలంటూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బాలాస్టి రమేష్ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.

**గురువు మనసులో రగులుతున్న ఆవేదన.**

సోమవారం కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో మొదటిరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల ఉపాధ్యాయుల ఉత్సాహం మధ్య ప్రారంభమైంది. పెనుగొండ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలతో పాటు కట్టుగూడెం, మర్రి తండా, గోప్య తండా, సబ్బేషన్ తండా, బేరువాడ, రంగాపురం, కేసముద్రం వంటి మారుమూల గ్రామాల్లోని పాఠశాలలను టి పి టి ఎఫ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బ్రతుకు చిత్రాలను, వారి మనోవేదనను జిల్లా అధ్యక్షులు బాలాస్టి రమేష్ పత్రికా ముఖంగా వివరిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.2023 జూలై నుంచే అమలు కావాల్సిన పీఆర్సీని ఇంతవరకు ప్రకటించకపోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి వేతన సవరణ లేకపోవడంతో ఉపాధ్యాయ కుటుంబాలు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నాయని, బ్రతుకు బండిని లాగడానికి భారంగా మారుతోందని పేర్కొన్నారు.

**దాచుకున్న సొమ్ముకూ తలుపు తట్టాలా?**

సంక్షేమం పేరుతో ఉచిత పథకాలకు అహర్నిశలూ నిధులు కుమ్మరిస్తున్న ప్రభుత్వం.. సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయులకు హక్కు ప్రకారం రావలసిన వాటిని ఎందుకు తొక్కేస్తోంది?అని బాలాస్టి రమేష్ ప్రశ్నించారు. ఉపాధ్యాయులు తమ భవిష్యత్తు కోసం కష్టపడి దాచుకున్న జీపీఎఫ్ బకాయిలను కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రుల పాలైనప్పుడు ఆదుకోవాల్సిన మెడికల్ రీయింబర్స్మెంట్లు, ఆరు డీఏ లు పెండింగ్‌లోనే ఉంచడంతో ఉపాధ్యాయుల మనసులు తీవ్ర




ఆందోళనకు గురవుతున్నాయని స్పష్టం చేశారు.

**కదిలిన గురుసేన.. ఉపాధ్యాయుల ఐక్యత.**

మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్, ప్రధాన కార్యదర్శి నన్నపురాజు నర్సింహ రాజు నేతృత్వంలో సాగిన ఈ పర్యటనలో ఉపాధ్యాయ లోకం తమ సమస్యలను ప్రతినిధుల దృష్టికి తెచ్చింది. ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్లక్ష్య వైఖరిని వీడి, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో బ్రతుకు నేలపై హక్కుల సాధన కోసం పోరాటాల శంఖారావం తప్పదని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు మోహన్ కృష్ణ, ఊటుకూరు ప్రణయ్ కుమార్, కుసుమ సంతోష్ తదితరులు పాల్గొని ఉపాధ్యాయులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు వినతి

-టివి వైఎస్ రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్

ఖానాపూర్ నియోజకవర్గం జూలై 14 నిజం న్యూస్: ఐటీడీఏ ఉట్నూర్ గ్రీవెన్స్ లో తెలంగాణ ఎస్ సి, ఎస్ టి, బీసీ మైనారిటి విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ నాయకత్వంలో ఏపీవో వసంతరావు కు వినతి పత్రం అందజేశారు. గవ్వల శ్రీకాంత్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పాఠశాలలు కళాశాలలు ప్రారంభమై నెలరోజులు దాటిన ఇప్పటివరకు 60 నుంచి 70 శాతం మాత్రమే విద్యార్థులు ఆశ్రమ పాఠశాలలకు కళాశాలలకు గురుకుల విద్యాలయలకు వచ్చినారని దాదాపుగా 30 నుండి 40 శాతం వరకు ఇంకా రావాల్సింది ఉందని విద్యార్థుల పట్ల ఎందుకు వివక్ష చూపిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. అప్పటివరకు చెప్పిన పాఠాన్ని రాయడానికి నోటు బుక్కులు కూడా ఇవ్వలేదని అదేవిధంగా ట్రంక్స్ బాక్సులు బెడ్ సీట్లు ప్లేట్లు గ్లాసులు స్కూల్ డ్రెస్సులు వెంటనే ఇవ్వాలని అదేవిధంగా పెండింగ్ ప్రెస్ కాస్మోటిక్ చార్జీలు స్కాలర్ షిప్ లు ఇవ్వాలని కొంతమంది అధికారులు ప్రతినెల ప్రతి బిల్లుపై 10 శాతం నుంచి 20 శాతం వరకు కమిషన్లు పై అధికారులు తీసుకుంటున్నారని కింది అధికారులు చెపుతున్నారని వాస్తవంగా తీసుకుంటున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మెనూ ఖచ్చితంగా పాటించాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఉద్యోగులు 150 కిలోమీటర్ల నుండి 200 కిలోమీటర్ల పైన ప్రతిరోజు సమయాన్నిబట్టి డ్యూటీకి వస్తున్నారని రావడమే ఉదయం 11 గంటల నుంచి 12 గంటల



వరకు వచ్చి స్పెషల్ వంటలు చేయించుకుని తిని మళ్లీ మధ్యాహ్నం రెండు గంటలకే తిరుగు ప్రయాణం చేస్తున్నారని వీరి వల్ల విద్యార్థులకు ఎక్కడ న్యాయం జరుగుతుందని గవ్వల శ్రీకాంత్ అన్నారు. అదేవిధంగా నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం మల్లాపూర్ గ్రామంలో గల గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల గ్రౌండ్ ను అక్కడి కొంతమంది రైతులు కబ్జా చేసుకుని పంటలు తీసుకుంటున్న పట్టించుకునే అధికారులు కూడా లేరని వెంటనే పాఠశాల గ్రౌండ్ ని ఆసరా పాఠశాలకు అప్పగించాలని లేనియెడల ఆ పాఠశాల విద్యార్థులతో హాస్టల్ ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అదేవిధంగా అదే పాఠశాలకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు ఆదిలాబాద్ నుంచి ఇద్దరు నిర్మల్ ఖానాపూర్ నుండి ఆరుగురు డ్యూటీకి వస్తున్నారని అదేవిధంగా అదే ఆస్టల్ తో పాటు ఇతర రాష్ట్రంలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగుల పరిస్థితి అదే విధంగా ఉందని ఉపాధ్యాయుల పరిస్థితి ఈ విధంగా ఉంటే వారిని ఆసరాగా చేసుకొని కొంతమంది నాలుగో తరగతి ఉద్యోగులు వారి వంతులకు నెలకు పదివేల రూపాయలు ప్రైవేట్ జీతాలు ఇచ్చి ఉంచుకొని వారితో పని చేయించుకుంటూ టీచర్లు ఎంతో మేం కూడా అంతే అని చాలెంజ్ వేసి వారి సొంత వ్యాపారం చేసుకుంటున్నారు. అలాంటి వారిని గుర్తించాలంటే ఒక ఇంటలిజెంట్ వ్యవస్థను ఏర్పాటు చేసి వారిని గుర్తించి వారిపై చర్య తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిసిసి అధికారులు ఇష్టారాజ్యంగా బయట ఇతర వ్యాపారస్తులకు అమ్ముకుంటూ మిగతా కొన్నిటిని హాస్టళ్లకు సప్లై చేస్తున్నట్టు అనుమానం ఉంది. అనేకమంది తెలుపుతున్నారు. ఇంకా టెండర్లు వేయకుండా టెండర్లు వేసినటువంటి వ్యాపారస్తులు విద్యార్థులకు సరైన సమాగ్రి అందించకపోవడం వలన అనారోగ్యాలకు గురి కావలసినటువంటి పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి వెంటనే పిఓ రహస్యంగా ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు లేదా 11 గంటల వరకు సాయంత్రం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు హాస్టల్ విజిట్ చేస్తే అసలు వాస్తవాలు బయట పడతాయని గవ్వల శ్రీకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ తో పాటు సంఘం జిల్లా అధ్యక్షులు సెడ్మకి భీమ్రావు విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ మెస్రం భాస్కర్ సంఘం నాయకులు కత్లే రవికిరణ్ రాథోడ్ అఖిల్ పవర్ పాండు వసంతరావు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.




# కొత్తపల్లెలో సర్పంచ్ జవ్వాజి రమేష్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

గోరికొత్తపల్లి, జూలై 14 నిజం న్యూస్: గోరికొత్తపల్లి మండలంలోని కొత్తపల్లె గ్రామంలో సర్పంచ్ జవ్వాజి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో వైద్యుల బృందం రక్తపోటు, మధుమేహం, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించింది. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు, పరిశుభ్రత, సురక్షితమైన తాగునీటి వినియోగం, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జవ్వాజి రమేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యమే తమకు ముఖ్యమని, గ్రామంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందేలా ఇలాంటి ఆరోగ్య శిబిరాలను తరచూ నిర్వహిస్తామని తెలిపారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, యువకులు, మహిళలు పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ సర్పంచ్ జవ్వాజి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

